పార్లమెంట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.విక్టర్


విక్టర్

అబిడ్స్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అధికారులు నిమగ్నమయ్యారు. జూన్ 4న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 2,74,522 ఓట్లకు గాను 1,50,207 ఓట్లు పోల్ అయ్యాయని ఆయన తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రారంభించామని విక్టర్ వివరించారు. కోఠి ఉమెన్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ప్రారంభించిన సందర్భంగా ఏఆర్‌ఓ విక్టర్ మాట్లాడుతూ..14 టేబుళ్ల ద్వారా 17 రౌండ్లలో ఈ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను వివిధ పార్టీల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. కట్టుదిట్టమైన భద్రత వలయంలో ఉన్న ఈవీఎంలను పార్టీ అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు ఎన్నికల పర్యవేక్షకుల సమక్షంలో కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చి ఓట్ల లెక్కింపు చేపడుతామన్నారు.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు..

ఓట్ల లెక్కింపు కేంద్రంలో సెల్‌ఫోన్లకు అనుమతి లేదని ఏఆర్‌ఓ విక్టర్ వెల్లడించారు. కౌంటింగ్ హాల్ లోపలికి పార్టీల ఏజెంట్లకు పాసులు జారీ చేస్తామని, పాసులు ఉన్నవారికే లోపలికి అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ హాల్ పరిసరాల్లో సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పోలీస్, స్థానిక పోలీసులచే బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

వైభవంగా బసవేశ్వరుడి శోభాయాత్ర


జియాగూడ నుంచి ఎగ్జిబిషన్‌కు తరలివెళ్తున్న భారీ ఊరేగింపు

జియాగూడ: బసవేశ్వరుడి జయంతిని పురస్కరించుకుని జియాగూడ బసవ మండప్ నుంచి శోభాయాత్ర ప్రారంభమై ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంది. ఆదివారం బసవ జయంతి ఉత్సవ సమితి భాగ్యనగర్ హైదరాబాద్ ఎల్‌డీఎంఎస్, కేజీఏఎన్ఎం, వైఆర్‌బీడీల ఆధ్వర్యంలో జియాగూడ బసవ మండప్ నుంచి భారీ ఎత్తున ఊరేగింపు ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా కుల్సుంపురా ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ రామదాస్ హాజరై పూజలు నిర్వహించగా శోభాయాత్ర ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఊరేగింపు జియాగూడ బసవ మండప్, పురానాపూల్, జుమ్మేరాత్‌బజార్, బేగంబజార్, ఎంజే మార్కెట్ మీదుగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకుంది. ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా బసవేశ్వరుడి విగ్రహం, గంగామాతాజీ అక్కమ్మ దేవీ, ఇతర మహాపురుషుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపులో భజన కీర్తనలు మహిళలు నిర్వహించగా మేళ తాళాలతో ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బసవదళ్ అధ్యక్షుడు శంకరప్ప పాటీల్, ఉపాధ్యక్షుడు కుంటబీర్ జగన్నాథప్ప, ప్రధాన కార్యదర్శి అనిల్ పాటీల్, యూత్ ఆర్‌బీడీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ కాల్సే, ప్రభాకర్ సతాడే, విజయ్‌కుమార్ పట్నే, అధ్యక్షులు భాగ్యవన్ జవలే, ప్రధాన కార్యదర్శి కె.మారుతి, ఉపాధ్యక్షుడు కె.శివాజీ, సహా కార్యదర్శి జయరాజ్, కోశాధికారి జగన్నాథ్ జవాలే, భీమ్‌రావ్ బిరాదర్, వైద్యన్నాథప్ప పాల్గొన్నారు.


ఏసీపీ మునావర్‌ను సన్మానిస్తున్న జగన్నాథప్ప, నాగరాజ్ కాల్సే

ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న హనుమంత్‌రావు, శ్రీరాములు

చార్మినార్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు సాధిస్తామని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్‌రావు అన్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆదివారం సాయికృప వసంత్ బంకెట్ హాల్‌లో జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రులు, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ రాయల్, శాలిబండ రాజేశ్ మెడికల్ హాల్ సహకారంతో జరిగిన ఈ వైద్య శిబిరంలో 500 మందికి పైగా వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. సంపూర్ణమైన ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. వైద్య శిబిరం నిర్వాహకులు ఆకుల శ్రీరాములు బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం చైర్మన్ మ్యాడం వెంకట్ రావు, ట్రస్టీ పిల్లి శ్రీనివాస్‌రావు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుట్టం పురుషోత్తం, సంఘం ప్రధాన కార్యదర్శి బిట్ల హన్స్‌రాజ్, రాష్ట్ర యువక మండలి ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు డి.ఆర్.ప్రభాకర్‌రావు, పల్లే శ్రావణ్, పోసు కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.చంద్రకుమార్, కార్యదర్శి కాటిక శ్రీధర్, కోశాధికారి మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా ఆలయ నూతన కమిటీ ఎన్నిక

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఈ ఏడాదికి సంబంధించి ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మాజీ చైర్మన్ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్‌గా మరోసారి సి.రాజేందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బి.మారుతీ యాదవ్, కన్వీనర్‌గా జి.అరవింద్‌గౌడ్, కోశాధికారులుగా పి.సతీష్ ముదిరాజ్, ఎ.చంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా కమిటీ కార్యవర్గం మొత్తం పాత సభ్యులు కొనసాగుతారని తీర్మానం చేశారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా చైర్మన్ తెలిపారు.



3 నెలలకు ఒక్కసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలి



సుల్తాన్‌బజార్: నిత్యం బిజీగా ఉండే మానవ జీవితంలో మూడు నెలలకు ఒక్కసారన్నా వైద్య పరీక్షలు చేసుకోవాలని కింగ్ కోఠి కామినేని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఐసాక్ సామిల్ తెలిపారు. కింగ్‌కోఠి కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాలుగు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా అబిడ్స్‌లోని ఆఘాఖాన్ సొసైటీ కమ్యూనిటీ హాల్‌లో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. బీపీ, షుగర్, బ్లడ్ చెకప్, బ్లడ్ ఇన్వెస్టిగేషన్, కళ్లకు మరియు డెంటల్‌కి సంబంధించిన పరీక్షలు చేసినట్లు వివరించారు. పరీక్షల అనంతరం శస్త్ర చికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఫ్రీగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. బిజీ లైఫ్‌కి అలవాటుపడ్డ ప్రజలు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే మెడికల్ షాప్‌కి వెళ్లి మాత్రలు తీసుకొని వేసుకుంటారని, అది తాత్కాలిక ఉపశమనమేనని పరీక్షలు చేసుకొని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కింగ్‌కోఠి కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఫ్రీ హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ ఐసాక్ సామిల్ కోరారు. ఈ హెల్త్ క్యాంప్‌లో నిర్వహకులు అనురాగ్, శ్రీనాథ్‌లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు అంజు, భార్గవి, సంకీర్తన, రజిత తదితరులు పాల్గొన్నారు.

‘సీసీ కెమెరాలకు నిధులు ఇస్తా’

చాదర్‌ఘాట్: ఎమ్మెల్సీ నిధుల నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నిధులను ఇస్తానని మాజీ హోం మంత్రి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ హామీ ఇచ్చారు. బీఎస్‌రెడ్డి డివిజన్ గాయత్రీనగర్ ఫేజ్–2 వాసులు కాలనీ ప్రెసిడెంట్ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం అజంపురాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిశారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక నిధులు మంజూరు చేస్తానని మహమూద్ అలీ హామీ ఇచ్చారు.

శిథిల భవనాల కూల్చివేతకు రంగం సిద్ధం


శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసిన అధికారులు

- నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- 2023 వరకు 25 శిథిల భవనాల గుర్తింపు

అబిడ్స్: వర్షాకాలం ప్రారంభం కానుండడంతో శిథిల భవనాలను కూల్చివేసేందుకు జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రాణాంతకంగా మారిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నారు. గతంలో శిథిలావస్థ భవనాలతో కూలిపోయి పలు విషాదకర సంఘటనలు జరిగాయి. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు పురాతన భవనాలను నేలమట్టం చేసేందుకు నిమగ్నమయ్యారు. ఇటీవలనే గోషామహల్ నియోజకవర్గంలో ఒక పాత భవనం నేలమట్టం చేశారు. శిథిలావస్థకు చేరుకున్న పలు భవనాలను తొలగించాలంటే జీహెచ్ఎంసీ అధికారులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కోర్టు వివాదాలే కారణం..

అబిడ్స్–14వ సర్కిల్ పరిధిలో శిథిలావస్థ భవనాలను కూల్చాలంటే జీహెచ్ఎంసీ అధికారులకు తలనొప్పిగా మారింది. పలు పాత భవనాలలో కిరాయిదారులు, ఓనర్లకు మధ్య ఎన్నో సంవత్సరాలుగా వివాదాలు చెలరేగుతున్నాయి. ఇరువురు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఈ పాత భవనాల సమస్యలు సంవత్సరాల కొద్ది కేసులుగానే కొనసాగుతున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు ఇలాంటి వివాదంగా ఉన్న భవనాలను కూల్చివేయలేక పోతున్నారు. సర్కిల్–14వ పరిధిలోని గోషామహల్, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, షాయినాయత్‌గంజ్, సిద్ధిఅంబర్‌బజార్, చుడిబజార్, జాంబాగ్ ప్రాంతాల్లో పురాతనమైన పలు భవనాలు అలాగే ఉన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు 2023 వరకు 25 శిథిలావస్థ భవనాలను గుర్తించారు. ఆయా భవనాలకు నోటీసులు కూడా జారీ చేశారు. మరో 6 భవనాలను ఇటీవల గుర్తించారు.

నోటీసులు జారీ చేస్తున్నాం..



శిథిలావస్థ భవనాలను కూల్చివేసేందుకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని భవనాలలో న్యాయపరమైన సమస్యలు ఉన్నందునా కూల్చివేత ఆలస్యమవుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల నివేదికలు వచ్చిన వెంటనే శిథిలావస్థ భవనాల కూల్చివేతలు వేగవంతంగా చేపడుతాం. మా సిబ్బంది సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి శిథిలావస్థ భవనాలను కూల్చివేసేందుకు కృషి చేస్తున్నాం.

– సయ్యద్ సైదుద్దీన్, ఏసీపీ

మధ్యప్రదేశ్ సీఎంకు స్వాగతం


స్వాగతం పలుకుతున్న పాండు యాదవ్, డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్

జియాగూడ: మధ్యప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌కు గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండు యాదవ్, డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు నందకిశోర్ యాదవ్ నగరానికి వచ్చిన ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేంద్రంలో బీజేపీ 400 సీట్లలో అఖండ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం


దేవర శ్రీనివాస్

గోల్కొండ: కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఈసారి పార్లమెంట్‌లో బీజేపీ 400 ఎంపీ స్థానాలు గెలుచుకుంటుందని ఆయన అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. బలంలేని ప్రతిపక్ష పార్టీలు ఉనికిని కాపాడుకోవడానికి మాత్రమే ఎన్నికల్లో నిలబడ్డాయన్నారు. సమర్థవంతమైన మోదీ పాలనతో ప్రాంతీయ పార్టీలకు కాలం చెల్లిందని ఆయన అన్నారు.

కత్తితో బెదిరించి బంగారం, నగదుతో ఉడాయించారు

గౌలిపురా: చార్మినార్ సందర్శనకు వచ్చిన ఓ కుటుంబాన్ని కత్తితో బెదిరించి బంగారం, నగదుతో ఉడాయించిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్సై సిహెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా భూశాయ తండాకు చెందిన బి.భావ్‌సింగ్ (27) ఈ నెల 25న కుటుంబసభ్యులతో కలిసి చార్మినార్‌ను సందర్శించి మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి వెళ్లేందుకు చార్మినార్ బస్టాండ్ వద్ద వేచి ఉన్నారు. అదే సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి భావ్ సింగ్ కుటుంబ సభ్యులకు కత్తి చూపించి బెదిరించి వారి వద్ద ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, రూ.10 వేల నగదుతో ఉడాయించారు. దీనిపై బాధితుడు భావ్ సింగ్ మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రీ: జంట నగరాలలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐ)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ప్రైవేటు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తోట గణేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి విద్యార్హత కలిగిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యాలను పెంచుకుని ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 93947 89962 లో సంప్రదించాలని సూచించారు.

పాతబస్తీలో సందర్శకుల సందడి


గుల్జార్‌హౌజ్ వద్ద..

చార్మినార్: పాతబస్తీలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్తీలోని పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. తమ కుటుంబ సభ్యులతో కలిసి పాతబస్తీలోని చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.

కోటలో కిటకిట..

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో జన సంద్రమైంది. ఆదివారం వేల సంఖ్యలో పర్యాటకులు కోటకు వచ్చారు. ఉదయం నుంచే కోటలోని బుక్కింగ్ కౌంటర్ వద్ద భారీ క్యూలు ఏర్పడ్డాయి. గంట గంటకూ పర్యాటకులు పెరుగుతూపోవడంతో కోటలోని నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టిపో, ఆయుధాగారాలన్ని కిటకిటలాడాయి. ఎండను సైతం లెక్క చేయకుండా ఎంతో హుషారుగా పర్యాటకులు కోటలోని ఆయుధాగారంతో పాటు రాణి మహల్, అక్కన్న మాదన్న కార్యాలయం తదితర వాటిని ఎంతో ఆసక్తిగా తిలకించారు. మరోవైపు యువ జంటలు కోట నగీనాబాగ్‌లోని చెట్ల మధ్య, ఫిరంగుల మధ్య ఫోజులు ఇస్తూ సెల్ఫీలు దిగారు.


కోటలో పర్యాటకులు

బీటీ రోడ్డు వేయాలి

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న దృష్ట్యా అభివృద్ధి పనుల కోసం జియాగూడ ప్రధాన రహదారి ఇటీవల పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టి పూర్తి చేశారు. కాగా బీటీ రోడ్డు వేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం నుంచి రథోత్సవ వేడుకలు కూడా పురానాపూల్ వరకు కొనసాగుతాయి. బీటీరోడ్డు వేసినట్లయితే ఊరేగింపు సజావుగా కొనసాగుతుందని జియాగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ అన్నారు.


రోడ్డును చూపిస్తున్న నరహరి చారి, కిశోర్‌కుమార్

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

గోల్కొండ: అసలే ప్రజలు ఎండతో బేజారెత్తిపోతున్నారు. దీనికి తోడు కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. మెహిదీపట్నం రైతు బజార్‌తో పాటు గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో సైతం అన్ని రకాల కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. కూరగాయలు కొనడానికి వచ్చే వారు కూరగాయల ధరలు చూసి షాక్ తింటున్నారు. తమ బడ్జెట్‌లో గతంలో రెండు సంచుల నిండా కూరగాయలు వచ్చేవని ప్రస్తుతం అదే బడ్జెట్‌లో సగం సంచి కూడా నిండడం లేదని పలువురు మహిళలు అంటున్నారు. గత వారం ధరలతో పోల్చి చూస్తే అన్ని కూరగాయల ధరలు మూడు రెట్లు పెరిగాయి. టమాట కిలో–రూ.40, బీన్స్–140, బెండా–80, వంకాయ–80, ఆలుగడ్డ–40, బీరకాయ–120, కాకరకాయ–100 ఇదిలా ఉండగా ఆకుకూరల ధరలు కూడా బాగా పెరిగాయి.


మెహిదీపట్నం రైతు బజార్ వద్ద..

శిల్పారామంలో అలరించిన సంగీత విభావరి

మాదాపూర్: కళాకారులు అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సప్తస్వర అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంగీత నృత్య విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాహి పాహి, రామ రామ, మారుతీ మారుతీ, గేమ్ గేమ్ గణపతి తదితర భజనలను, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు ఆలపించి అలరించారు. కళాకారులు నిత్యకమలాశ్రీ నందు, ఆముక్త, శ్రీహిత, శ్రీనిక, యువన్, యాషిక, శ్రీవిద్య, కార్తీక్, పూజిత, వేదశ్రీ, గౌరీ తదితరులు పాల్గొని ఆలపించారు. వినాయకకౌతం, రామాయణశబ్దం, ఆధ్యాత్మ రామాయణ కీర్తన తదితర అంశాలను శ్రీనిధి , మహతి, మైథిల్యా ప్రదర్శించి అలరించారు.


సంగీత విభావరిలో పాల్గొన్న చిన్నారి కళాకారులు

అన్నదానం


అన్నదానం చేస్తున్న మహ్మద్ బషీర్

గోల్కొండ: రెండేళ్ల నుంచి విరామం లేకుండా ప్రతినిత్యం ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సెకండ్ ల్యాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద రోగులు, వారి సహాయకుల కోసం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తాము అందిస్తున్న భోజన ప్యాకెట్లు ఇద్దరు వ్యక్తులకు సరిపోతుందన్నారు. భోజన ప్యాకెట్‌తో పాటు మినరల్ వాటర్ బాటిల్స్ కూడా ఇస్తున్నామన్నారు. మరిన్ని ఎక్కువ ఆసుపత్రుల వద్ద అన్నదానం చేయడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

టోపీలకు భలే గిరాకీ

గోల్కొండ: గోల్కొండ కోట వద్ద వివిధ రకాల క్యాప్స్, టోపీలు జోరుగా అమ్ముడవుతున్నాయి. కోటకు పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారు. పర్యాటకులకు ఆకట్టుకునే విధంగా కోట వద్ద ఉన్న టోపీల స్టాల్స్ వారు రకరకాల క్యాప్‌లను అందుబాటులో ఉంచారు. పిల్లలు ఈ క్యాప్‌లు ఎంతో ఇష్టపడుతున్నారు. బాలికలు, మహిళల కోసం రకరకాలైన క్యాప్‌లు కూడా వివిధ రంగుల్లో ఇక్కడ లభిస్తున్నాయి. యువకులు, సీనియర్ సిటిజన్స్ ఆకట్టుకునేలా ఇక్కడ క్యాప్ ఉన్నాయి. ఒక్కో క్యాప్ డిజైన్‌ను బట్టి రూ.100–250 రూపాయల చొప్పున అమ్ముతున్నారు. జెమ్స్ బాండ్, క్వీన్ విక్టోరియా, ప్రిన్సెస్ దయానా పేర్లు ఉన్న క్యాప్స్ బాగా అమ్ముడవుతున్నాయి.


కోట వద్ద టోపీలు కొంటున్న పర్యాటకులు

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరీ రచించిన గజల్ల సంపుటాలను ఆదివారం రవీంద్ర భారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..గజల్ చరిత్రలో నూతన అధ్యాయనానికి నాందిపలికిన రచయిత్రి ప్రపంచ రికార్డులను పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు గాయనీ గాయకులు ఆలపించిన గజల్ గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవి కళారత్న బిక్కి కృష్ణ, సినీ గేయ రచయిత వెనిగల్ల రాంబాబు, గజల్ కవి సూరారం శంకర్, మురళీధర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ అధ్యక్షుడిగా వెంకటరమణ



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా మేకల బండ నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రెండేళ్ల పాటు కొనసాగనున్న ఈ కమిటీకి సంబంధించి ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక కార్యక్రమం కొనసాగింది. శాశ్వత చైర్మన్‌గా పొన్న సుదర్శన్, వర్కింగ్ చైర్మన్‌గా సి.వెంకటేష్, వైస్ చైర్మన్‌లుగా ప్రవీణ్ కుమార్, అల్లూరి శ్రీహరి రాజు, అధ్యక్షుడిగా పొన్న వెంకటరమణ, చీఫ్ అడ్వయిజరీగా ఆలూరి ధన్‌రాజ్, సలహాదారుడిగా భిక్షపతి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ నవీన్, కోశాధికారులుగా అనిల్‌కుమార్, తాడెం మాణిక్ ప్రభు, ఉపాధ్యక్షులుగా ఉత్తర ప్రవీణ్ కుమార్, ఆవుల వేద ప్రకాష్, ప్రేమ్‌కుమార్, ఊరేగింపు కమిటీ అధ్యక్షుడిగా సహదేవ్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు.

ఆకట్టుకున్న కాళీమాత నృత్యోత్సవం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ అర్ధనారీశ్వరం వెంకట్ 2వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రవీంద్రభారతిలో కాళీమాత నృత్యోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఏకేవీఎస్. రెడ్డి మాట్లాడుతూ..అర్ధనారీశ్వర వెంకట్ గొప్ప కళాకారుడని ఆయన మన మధ్య లేకపోవడం కళారంగానికి తీరని లోటన్నారు. అంతకు ముందు వెంకట్ కుమారుడు రిత్విక్ వెంకట్ కాళీమాత నృత్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ ఎస్పీ. భారతి, వెంకట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ



చార్మినార్: రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది డిశార్జి అయిన ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌ను హజ్రత్ పీర్–ఓ–ముర్షిద్ అల్ హాజ్ సయ్యద్ భక్తియార్ ఆలంతో పాటు సయ్యద్ కుందమీర్ సఖైష్ ఆలం తదితరులు కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం సాధ్యమైనంత వెంటనే కుదట పడి పేద ప్రజలకు సేవలను అందజేయాలని కోరుతై వారు ఆశీర్వదించారు.